క్లుప్తంగా

డిగ్రీ విద్యార్థినికి అభినందన



విద్యార్థినితో అధ్యాపకులు

పాకాల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీకామ్ థర్డ్ ఇయర్ విద్యార్థిని ఎస్.వర్షిత వ్యాస రచన పోటీల్లో ప్రతిభను కనబరచినట్లు ప్రిన్సిపల్ మొహిద్దీన్‌బాషా తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ హార్ట్‌ఫుల్‌నెస్ ఫౌండేషన్ నిర్వహించిన జాతీయ స్థాయి వ్యాసరచన పోటీలో ద్వితీయ బహుమతి సాధించినట్లు వెల్లడించారు. ఈ నెల 16వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో కామన్‌వెల్త్ జనరల్ సెక్రటరీ చేతుల మీదుగా బహుమతి, ప్రశంసా పత్రం అందుకోనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ప్రిన్సిపల్‌తోపాటు వైస్ ప్రిన్సిపల్ రమేష్‌కుమార్, అధ్యాపకులు ఈశ్వర్‌బాబు, రమణమ్మ, చట్టికళావతి, మోహన్ బెహరా అభినందించారు.

మహిళలతో ముఖాముఖి



మాట్లాడుతున్న సుధారెడ్డి

పాకాల : మండలంలోని మహిళలతో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం గాదంకి, నేంద్రగుంట, శంఖంపల్లె పంచాయతీలకు చెందిన మహిళలతో ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి చేపట్టిన అభివృద్ధి పనులు వివరించారు. ఆయా గ్రామాల్లోని సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి వెంటనే చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు చాముండేశ్వరి, రాజ్యలక్ష్మి, సావిత్రి, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం

పాకాల : స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల 31వ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ సుదర్శన్‌ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు బాధ్యతగా మెలగాలని, పెద్దలతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని కోరారు. విద్యార్థినులు సత్ప్రవర్తనతో ఉండాలని, తల్లిదండ్రుల మాట వినాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.బేబీశ్వర్‌రెడ్డి , విశ్రాంత ప్రిన్సిపల్ వెంకటరత్నం, జీజీహెచ్ ఇన్‌చార్జి హెచ్‌ఎం జయచంద్ర, కళాశాల అభివృద్ధి కమిటీ సెక్రటరీ ఆర్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీలోని ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం వే ఫౌండేషన్, రవాణాశాఖ వారు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. 'నేషనల్ రోడ్డు సేఫ్టీ మంత్ ' అంశంపై జిల్లా రవాణా శాఖ అధికారి మురళి మాట్లాడుతూ నిబంధనలు పాటించడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సీటు బెల్ట్, హెల్మెట్ ధరించడం తప్పనిసరని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ అంకయ్య పాల్గొన్నారు.

ఘనంగా 'గీతం' వార్షికోత్సవం



నృత్య ప్రదర్శనలో విద్యార్థులు

తిరుపతి కల్చరల్ : భవానినగర్‌లోని గీతం పాఠశాల 13వ వార్షికోత్సవాన్ని శుక్రవారం మహతి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, జిల్లా రవాణా శాఖ అధికారి కె.మురళీమోహన్, లిటిల్ ఏజెంట్స్ పాఠశాల అధినేత ఎం.రమాదేవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రిన్సిపల్ కిన్నెర శ్రీదేవి పాఠశాల వార్షిక నివేదికను సమర్పించారు. పాలడుగు హరికృష్ణమనాయుడు మెమోరియల్ అవార్డును ఎస్‌ఎస్‌సీ టాపర్ భానుప్రకాష్‌కు స్కూల్ అధినేత డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు అందించారు. లక్ష్మమ్మ పాలడుగు హరికృష్ణమనాయుడు మెమోరియల్ బంగారు పతకం ప్రదానం చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

అదనపు కమిషనర్ బదిలీ

తిరుపతి తుడా: నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సి.చరణ్ తేజ రెడ్డిని ప్రభుత్వం శుక్రవారం బదిలీ చేసింది. ఆయనను స్టేట్ ఆడిట్ విభాగానికి పంపిస్తున్నట్లు పేర్కొంది.

వైద్యం కోసం వచ్చి మృత్యువాత

తిరుపతి తుడా: అనారోగ్యంతో ఓ వ్యక్తి వైద్యం కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి శుక్రవారం వచ్చాడు. ఓపీ తీసుకుని వైద్యం చేయించుకునేందుకు వెళ్లే క్రమంలో ఆ వ్యక్తి ఆస్పత్రి ప్రాంగణంలోనే ప్రాణాలు వదిలాడు. అక్కడ విధుల్లో ఉన్న సిబ్బంది గమనించి వైద్యుల కు సమాచారం అందించారు. సమీపంలోని వైద్యులు వచ్చి పరిశీలించగా అప్పటికే ఆ వ్యక్తి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఓపీ తీసుకునేటప్పుడు తిరుపతి జిల్లా, ఏర్పేడు మండలం , వికృతమాల సమీపంలోని మర్రిమందకు చెందిన వ్యక్తిగా నమోదు చేసుకున్నాడు. మృతుడి వద్ద ఆధార్ కార్డును పరిశీలించగా ఇదే అడ్రస్‌తో నమోదై ఉంది.

తిరుగులేని శిక్షణ



పద్మావతి డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులకు మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఎన్‌సీసీ శిక్షణను శుక్రవారంతో ముగించారు.. ప్రయోగ, డ్రిల్ ప్రాక్టీస్ అనంతరం బీ, సీ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నారాయణమ్మ, సీటీఓ సీహెచ్ సుహాసిని, అటానమస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఉమారాణి, హాస్టల్ వార్డెన్ హేమలత, ఆంగ్ల విభాగాధిపతి వెంకటలక్ష్మి, డాక్టర్ శ్రీలక్ష్మి, ఎన్‌సీసీ అధికారులు సుబేదార్ సింగార్ సింగే, హవల్దార్ ప్రేమరామ్, నయబ్ ప్రకాష్, నయబ్ సుబేదార్ కైలాష్ కుమార్, ఎంకే చౌదరి పాల్గొన్నారు.

– తిరుపతి సిటీ

తెప్పోత్సాహం



శ్రీగోవిందరాజస్వామి వారి తెప్పోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం రుక్మిణి, సత్యభామ సమేత శ్రీపార్థసారథిస్వామి వారు తెప్పపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉభయ దేవేరులతో కలిసి పుష్కరిణిలో ఐదు ప్రదక్షిణలు పూర్తి చేశారు. అనంతరం మాడ వీధుల్లో ఊరేగారు. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో హరికథ, భజనలు నిర్వహించారు. తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి పాల్గొన్నారు. – తిరుపతి కల్చరల్

సదస్సుల ఆర్భాటం.. వాయిదాలే అంతిమం!

భూ సమస్యల పరిష్కామే లక్ష్యమని ప్రకటించారు. అర్జీ ఇస్తే అండగా నిలబడతామని ఊదరగొట్టారు. నిర్దేశిత సమయంలో వినతులను పరిశీలించి సమస్య తీరుస్తామని హామీలు గుప్పించారు. ఈ మేరకు విస్తృతంగా రెవెన్యూ సదస్సులను ఆర్భాటంగా నిర్వహించారు. ఎమ్మెల్యే.. కలెక్టర్.. కార్పొరేషన్ కమిషనర్ ఆధ్వర్యంలో శెట్టిపల్లె వాసుల నుంచి వందల సంఖ్యలో అర్జీలు స్వీకరించారు. జనవరి 31వ తేదీకి అన్నింటినీ పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. అయితే ఇప్పటికీ వాయిదాల మీద వాయిదాలు వేస్తూనే ఉన్నారు. తాజాగా శుక్రవారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఆయా వినతులను ఈ నెలాఖరులోపు సెటిల్ చేస్తామంటూ మరోసారి వాయిదా వేశారు.

- పరిష్కారం కాని శెట్టిపల్లె భూ సమస్యలు
- కనీసం మాత్రం అమలు కాని హామీలు
- కలెక్టరేట్‌లో సమీక్షించిన అధికారులు
- ఈ నెలాఖరులోపు సెటిల్ చేస్తామంటూ ప్రకటనలు



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్లు



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్, చిత్రంలో ఎమ్మెల్యే ఆరణి (ఫైల్)

తిరుపతి అర్బన్ : గత ఏడాది డిసెంబర్ 30వ తేదీన శెట్టిపల్లెలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంకటేశ్వర్, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పలువురు అధికారులు హాజరయ్యారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జనవరి 15 నాటికి 50 శాతం జనవరి 31వ తేదీ నాటికి పూర్తి స్థాయిలో శెట్టిపల్లె భూసమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అయితే ఆ తర్వాత ఆ ఊసేలేదు.

తాజాగా మరో తేదీ..

శెట్టిపల్లి భూ సమస్యల పరిష్కార అంశం మరోసారి వాయిదా పడింది. కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ వెంకటేశ్వర్లు, జేసీ శుభం బన్సల్, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, ఆర్‌డీఓ రామ్మోహన్ కలిసి పలువురు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో మరో మూడు వారాల్లోనే శెట్టిపల్లె భూ సమస్యకు పరిష్కారం చూపుతామని స్పష్టం చేశారు. ఆ దిశగా అధికారులు కసరత్తు చేయాలని ఆదేశించారు. అధికారికంగా పేపర్ మీద లేఔట్ ప్లానింగ్ చేసి ప్లాట్లను లబ్ధిదారులకు చూపించనున్నట్లు వెల్లడియచారు. అలాగే తుడా ఆధ్వర్యంలో మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. సమావేశంలో తుడా సీపీఓ దేవి కుమారి, తుడా భూసేకరణ అధికారి సృజన పాల్గొన్నారు.

మొత్తం 624 అర్జీలు

గత ఏడాది డిసెంబర్ 2 వ తేది నుంచి 5వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు తిరుపతి ఆర్‌డీఓ కార్యాలయంలో శెట్టిపల్లె వాసుల నుంచి అర్జీలు తీసుకున్నారు. భూహక్కు పత్రాలతోపాటు వినతులను ఆర్‌డీఓ రామ్మోహన్‌కు అందించారు. 86 సర్వే నంబర్లకు సంబంధించి 624 అర్జీలను అధికారులు స్వీకరించారు. 20 రోజుల్లో సమస్యలన్నీ పరిష్కరిస్తామని వారు భరోసా ఇచ్చారు. అయితే ఇప్పటి వరకు ఒక్క సమస్యను కూడా పరిష్కరించలేక వాయిదాల పర్వం సాగిస్తున్నారు.



ఆర్‌డీఓ కార్యాలయం వద్ద గుమికూడిన అర్జీదారులు (ఫైల్)

నీటి కోసం నిధులకు డిమాండ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

తిరుపతి రూరల్ : నీటి ఎద్దడి నివారణకు నిధులు కేటాయించాలని ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. శుక్రవారం తిరుపతి రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ వేముల యశోద అధ్యక్షత వహించిన సభలో ఎమ్మెల్యే పులివర్తి నాని పాల్గొన్నారు. సభ్యులు మాట్లాడుతూ పేరూరు, లింగేశ్వరనగర్, గాంధీపురం, గొల్లపల్లె, అవిలాల, దామినేడు గ్రామాల్లో నీటి సమస్య అధికంగా ఉందన్నారు. ఎంపీటీసీ సభ్యుడు హరికృష్ణారెడ్డి మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు కనీస గౌరవం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు. ఎంపీడీఓ రామచంద్ర, వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి పాల్గొన్నారు.

వంతెనల నిర్మాణానికి వినతి

పూతలపట్టు –నాయుడుపేట జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, ఈ మేరకు చంద్రగిరి నుంచి గాజులమండ్యం వరకు అవసరమైన చోట్ల వంతెన నిర్మాణం చేపట్టాలని సర్పంచ్‌లు కోరారు. సర్పంచ్‌లు డీవీ రమణ, కోటేశ్వరరావు, దామినేటి కేశవులు, రమణ, చిన్నియాదవ్, విడుదల రవి, లక్ష్మీ, లక్ష్మీ రాజా, పిపాసి, ఎంపీటీసీ సభ్యులు మూలం చంద్రమోహన్ రెడ్డి, జయకర్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

బహిరంగ మద్యపానం నేరం

పాకాల : బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం నేరమని డీఎస్పీ బి.ప్రసాద్ తెలిపారు. శుక్రవారం పలు ప్రాంతాల్లో మందుబాబులు పడేసిన వ్యర్థాలను పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఈ మేరకు బ్యానర్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

క్యాన్సర్‌పై అవగాహన

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల, ఎస్వీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ , టాటా ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్వీ డబ్ల్యూ కళాశాలలో విద్యార్థులకు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ర్యక్రమంలో ప్రిన్సిపల్‌నారాయణమ్మ, వైద్యులు ప్రశాంత్, రవికుమార్, హేమంత్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

తిరుపతి క్రైం : రుయా ఆస్పత్రి ప్రాంగణంలో అనారోగ్యంతో వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. మృతుడు గుంటూరు జిల్లా, నెహ్రూనగర్‌కు చెందిన వెంకటేశ్వర (61)గా గుర్తించారు

సొమ్ము చెల్లించకుంటే జైలు

తిరుపతి లీగల్: చెక్ బౌన్స్ కేసులో సొమ్ము చెల్లించకుంటే ఏడాది జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తిరుపతి ఆరో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.విజయచంద్రరాణా శుక్రవారం తీర్పు చెప్పారు. వివరాలు..శ్రీకృష్ణనగర్‌కు చెందిన సుభాషిణి వద్ద జగన్నాథపురానికి చెందిన ఎం.వెంకటరెడ్డి రూ.7 లక్షలు అప్పుగా తీసుకుని చెక్కు ఇచ్చాడు. అది బౌన్స్ కావడంతో ఆమె అతనిపై కేసు దాఖలు చేశారు. వెంకట్‌రెడ్డి 10 లక్షల 300 రూపాయలు నెలలోపు చెల్లించాలని, లేకుంటే ఏడాది జైలు శిక్ష అనుభవించాలని తీర్పు చెప్పారు.

తిరుచ్చిపై సిరులతల్లి విహారం



ఊరేగుతున్న పద్మావతీ అమ్మవారు

తిరుపతి రూరల్ : తిరుచానూరు పద్మావతీ అమ్మవారు శుక్రవారం సాయంత్రం బంగారు తిరుచ్చి వాహనంపై విహరించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవారి ఉత్సవ మూర్తులను శ్రీకృష్ణ మండపంలోకి వేంచేపు చేసి కల్యాణ మహోత్సవం జరిపించారు. అనంతరం అమ్మవారిని తిరుచ్చి వాహనంపై కొలువు దీర్చి మాడ వీధులలో ఊరేగించారు.

శ్రీనివాసమంగాపురంలో..

చంద్రగిరి: శ్రీనివాసమంగాపుంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరాలయానికి అనుబంధంగా వెలసిన శ్రీకృష్ణ స్వామివారు, అమ్మవార్లతో కలసి శుక్రవారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో ఏఈఓ గోపీనాథ్, సూపరింటిండెంట్ వళ్లంశెట్టి రమేష్ బాబు, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ పాల్గొన్నారు.ఈ క్రమంలోనే శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల వాహన సేవల బుక్‌లెట్‌లను టీటీడీ ఈఓ శ్యామల రావు శుక్రవారం సాయంత్రం ఆవిష్కరించారు. ఆలయ స్పెషల్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి పాల్గొన్నారు

అభివృద్ధి పనులు వేగవంతం



సూచనలిస్తున్న స్మార్ట్ సిటీ ఎండీ మౌర్య

తిరుపతి తుడా : స్మార్ట్ సిటీ నిధులతో నగరంలో చేపట్టిన అభివద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని స్మార్ట్ సిటీ ఎండీ, కార్పొరేషన్ కమిషనర్ మౌర్య ఆదేశించారు. శుక్రవారం ఈ మేరకు అధికారులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ గరుడ వారధిలో కూడళ్లు, డివైడర్లు, గోడల సుందరీకరణ త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కమాండ్ కంట్రోల్ సెంటర్, సిటీ ఆపరేషన్ సెంటర్, మల్టీ లెవెల్ కార్ పార్కింగ్, తదితర ప్రాజెక్టులను నిర్మించాలని కోరారు. సమావేశంలో ఎస్‌ఈలు చంద్రశేఖర్, శ్యామ్‌సుందర్, డీఈలు రాజు, మహేష్, మధు, ప్రసాద్, ఏఓ రాజశేఖర్, సీఎఫ్‌ఓ మల్లికార్జున, ఏఈకాం ప్రతినిధులు బాలాజీ, అనిల్, ఆఫ్కాస్ ప్రతినిధి స్వామి పాల్గొన్నారు

ప్రజలకు అందుబాటులో ఉండాలి

సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని కమిషనర్ మౌర్య ఆదేశించారు. శుక్రవారం శ్రీనివాసం, పెద్దకాపు లేఔట్‌లో పారిశుద్ధ్య పనులను, రెండో వార్డులోని సచివాలయాలను తనిఖీ చేశారు. డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.

పలువురికి జరిమానా

తిరుపతి లీగల్ : మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 13 మందికి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పినట్టు కోర్టు సూపరిండెంట్ ఎస్‌పీ సుబ్బారెడ్డి తెలిపారు. అలాగే నగరంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ రోడ్డుకు ఇరువైపుల వ్యాపారాలు నిర్వహిస్తున్న 20 మందికి ఒక్కొక్కరికి రూ.500 చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి శుక్రవారం తీర్పు చెప్పారు.

'కిల్‌గేమ్ స్టార్స్' ప్రారంభం



షూటింగ్ ప్రారంభిసున్న అతిథులు

తిరుపతి కల్చరల్: నేటి సమాజంలో మహిళలను మరింత చైతన్యవంతం చేసే కథతో చేపట్టిన కిల్ గేమ్ స్టార్స్ షార్ట్ ఫిల్మ్ షూటింగ్‌ను శుక్రవారం ఓ ప్రైవేటు హోటల్లో సాయికళ ఫౌండేషన్ చైర్మన్ మధుసూదన్, తైక్వాండో సంఘం జిల్లా అధ్యక్షుడు ధనంజయ క్లాప్ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్మాత డాక్టర్ షీలా లోకనాథం, దర్శకుడు గోవింద్, నటులు భీమాస్ అశోక్, షీలా లోకనాథన్, హరి, కవిత, మనోజ్, ఐశ్వర్య, విలన్స్ ముని, శివ, ఆర్.మోని కారాజ్, సుబ్బు పాల్గొన్నారు.

క్రీడల్లో ఎస్‌జీఎస్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థుల సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపల్

తిరుపతి సిటీ : సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రీడల్లో ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు ప్రతిభను కనబరచినట్లు ప్రిన్సిపల్ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఈ మేరకు పలు విభాగాల్లో రాణించిన విద్యార్థులు జి.నవీన్, డి.స్మిత, డి.రఘునాయక్ , పి.నందకుమార్, ఎం.భరత్, టి.మహేష్, షేక్ బాబా ఫక్రుద్దీన్ , సి.మాలిని, ఎన్‌ఎస్ బాలాజీకి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. పీడీ కుమార్, వైస్ ప్రిన్సిపల్ పరమేశ్వర పాల్గొన్నారు.

చిరస్మరణీయులు ప్రభాకరశాస్త్రి



ప్రభాకరశాస్త్రి విగ్రహానికి పూలమాల వేస్తున్న వెంకటేశ్వర్లు తదితరులు



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

తిరుపతి కల్చరల్ : తిరుమల శ్రీవారి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేస్తూ అన్నమయ్య రచించిన సంకీర్తలను భరతజాతికి అందించిన చిరస్మరణీయులు వేటూరి ప్రభాకర్‌శాస్త్రి అని ఎస్వీయూ ప్రాచ్య పరిశోధనా సంస్థ డైరెక్టర్ ఆచార్య వెంకటేశ్వర్లు కొనియాడారు. శుక్రవారం ఎస్వీ ప్రాచ్య కళాశాల ఆధ్వర్యంలో ప్రభాకరశాస్త్రి 137వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్వేత భవనం ఎదుట ప్రభాకరశాస్త్రి విగ్రహానికి అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు రాజగోపాలరావు, గౌరిపెద్ది శంకర భాగవత్పాదులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సాహితీ సదస్సులో ఆయన మాట్లాడుతూ వేటూరి వారు ప్రాచీన సాహిత్యంతో పాటు కథలు, కథానికలు కూడా రచించారని వివరించారు. కార్యక్రమంలో సాహితీ వేత్త డాక్టర్ రాజశేఖర్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సీతారామారావు పాల్గొన్నారు.

ఘనంగా ప్రభాకరశాస్త్రి జయంతి

తిరుపతి సిటీ : వేటూరి ప్రభాకర శాస్త్రి 137వ జయంతిని శుక్రవారం ఎస్వీ వేదిక్ వర్సిటీలో ఘనంగా నిర్వహించారు. వీసీ రాణి సదాశివమూర్తి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా అమెరికాలోని సిలికాన్ ఆంధ్ర వ్యవస్థాపకుడు కె.ఆనంద్, డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ పాల్గిన్నారు. వారు మాట్లాడుతూ తెలుగు భాష ఉన్నంత కాలం వేటూరి కీర్తి ఉంటుందని, వారు రచించిన వ్యాసాలు, కథలను వాఙ్మయం పీఠం ద్వారా ప్రచురిస్తున్నామని వివరించారు. అనంతరం తెలుగు సాహిత్య జ్ఞాన సంపద, ప్రాచీన తెలుగు సాహిత్య సౌరభం పుస్తకాలను ఆవిష్కరించారు. రిజిస్ట్రార్ తారక రామకుమార శర్మ , పరిశోధన ప్రచురణ విభాగ నిర్వాహకుడు డాక్టర్ రాధేశ్యామ్, పీఆర్‌ఓ బ్రహ్మాచార్యులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలకు వినతి

తిరుపతి కల్చరల్ : నకిలీ పత్రాలతో తమ భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు చంద్రశేఖర్ కోరారు. శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. రేణిగుంట మండలం, కొత్తపాళెం 3.86 ఎకరాలు తన భార్య భాగ్యలక్ష్మి పేరిట ఉందని, ఈ మేరకు ప్రభుత్వం తమకు పట్టా సైతం మంజూరు చేసిందని తెలిపారు. అయితే గిరిధర్ మురారి అలియాస్ మఠం గిరి, కురకాల్వ నాగరాజు, మోహన్‌రెడ్డి, రామ్మూర్తి, మరో కార్పొరేటర్ కలిసి తమ భూమిని కబ్జా చేసి అమ్మేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని విన్నవించారు. సమావేశంలో బాధితులు భాగ్యలక్ష్మి, రమణ, యువరాజ్, శంకరయ్య పాల్గొన్నారు.

బాధ్యతగా పర్యావరణ పరిరక్షణ

తిరుపతి కల్చరల్ : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరి బాధ్యతని ఎస్వీయూ ఎన్విరాన్మెంట్ విభాగాధిపతి డాక్టర్ టి.దామోదరం పిలుపు నిచ్చారు. భారతీయ విద్యాభవన్ ఆధ్వర్యంలో ఇస్కాన్ వద్ద క్రీడా మైదానంలో చేపట్టిన పుస్తక ప్రదర్శన మహోత్సవం శుక్రవారంతో ఏడో రోజుకు చేరుకుంది. స్విమ్స్ డీన్ ఆల్లాడి మోహన్ డాక్టర్ ఎస్.సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

డాక్టరేట్‌ల ప్రదానం





రాజయ్య, యోగీశ్వరరావు

తిరుపతి సిటీ : ఎస్వీయూ ప్రాచ్య పరిశోధన సంస్థ పరిశోధక విద్యార్థులు ఎ.రాజయ్య, వడ్లమూడి యోగీశ్వరరావుకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో 'తెలుగులో సాహిత్య లేఖలు-పరిశీలన' అనే అంశంపై రాజయ్య, 'ఎస్వీయూ ప్రాచ్య పరిశోధన సంస్థ ప్రచురిత తెలుగు గ్రంథాలు పరిశీలన' అనే అంశంపై యోగీశ్వరరావు పరిశోధన పత్రాలు సమర్పించారు.